తలుపులలో టీడీపీకి ఎదురుదెబ్బ

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 200 మంది
- కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి



బేల్దార్ల సంఘం అధ్యక్షుడు బాషాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే



వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి

తలుపుల: మండల కేంద్రంలో టీడీపీకి షాక్ తగిలింది. సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు (కృష్ణారెడ్డి) ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన బేల్దార్ సంఘం అధ్యక్షుడు మహబుబ్‌బాషా, సంగం బజార్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు, ఎగువపేట, బలిజపేట, కుమ్మరపేట, దిగువపేట, ప్రకాష్ నగర్, ఆటో యూనియన్, పెయింటర్ యూనియన్ సభ్యులు సుమారు 200 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి వీరికి కండువాలు వేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. కార్యకర్తలకు పార్టీ పరంగా అన్ని సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో ఉండి ఆస్తులు అమ్ముకున్నామని టీడీపీ నాయకుడు శంకర చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీలో ఎవ్వరూ ఆస్తులు అమ్మి ఖర్చులు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. మండల స్థాయి నాయకుడు కానీ, ఎమ్మెల్యే కానీ డబ్బులు పెట్టుకోవడం జరిగిందన్నారు. కుర్లి శివారెడ్డి మాట్లాడుతూ.. మాజీ కన్వీనర్ కనీసం వార్డు మెంబర్ కూడా కాలేదని ఎద్దేవా చేశారు. అటువంటి వ్యక్తిని రెండు పర్యాయాలు మండల కన్వీనర్‌గా బాధ్యత ఇచ్చి గుర్తింపు ఇచ్చిన విషయాన్ని మరవకూడదన్నారు. వార్డు మెంబర్ కాని వ్యక్తులను సైతం మాజీ సర్పంచ్ అని పార్టీలోకి చేర్చుకోవడం టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌కే చెల్లుతుందన్నారు. బత్రేపల్లి సర్పంచ్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. తాను ఏ పార్టీలోకి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. కేవలం 10 కుటుంబాలు ఉన్న మా కులానికి వైఎస్సార్‌సీపీ గుర్తింపు ఇచ్చిం సర్పంచ్ పదవి కట్టబెట్టిందన్నారు. డీకే బాబు మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీలో తాతల కాలం నాటి నుంచి వేయని సీసీ రోడ్లు, వీధి లైట్లను వైఎస్సార్‌సీపీ హయాంలో వేయించడం జరిగిందన్నారు.

సంగం బజార్‌లో టీడీపీ ఖాళీ..

బేల్దార్ల సంఘం అధ్యక్షుడు మహబుబ్ బాషా మాట్లాడుతూ.. గతంలో టీడీపీకి కంచుకోటగా సంగం బజార్ ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తామంతా స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, వివేకానంద రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, వార్డు మెంబర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తింపు ఇచ్చే పార్టీలకే మద్దతు



మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక నాయకుడు

పుట్టపర్తి టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమకు గుర్తింపు ఇచ్చే పార్టీలకే మద్దతు ఇవ్వనున్నట్లు బీసీ ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఆదివారం పుట్టపర్తి పట్టణంలోని శిల్పారామమంలో బీసీ ఐక్యతా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున బీసీ నాయకులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బీసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు తిరిగి బీసీల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. జనవరి మెదటి వారంతో జిల్లాలో బారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బీసీలందరూ ఏకతాటిపైకి బీసీల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు సమకోటి ఆదినారాయణ, అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు, ఉపాధ్యక్షుడు తిరుపతేంద్ర, ప్రధాన కార్యదర్శి పవన్‌కళ్యాణ్, రాజశేఖర్, కార్యదర్శి సుబ్రమణ్యం, నాయకులు రవీంద్ర, శ్రీనివాసులు, కేశప్ప, హహేంద్ర, చండారయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

తనకల్లు: మండల పరిధిలోని ఈతోడులో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ఆదివారం ఘనంగా జరిగింది. అంతకుముందు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆంజనేయుడి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులరెడ్డి ఆలయాభివృద్ధికి రూ.20 వేల విరాళాన్ని అందజేశారు.

పరామర్శ..

తనకల్లు: మండల పరిధిలోని ఈతోడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులరెడ్డి ఆదివారం మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన దంపతులు కదిరప్ప, రమణమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు తెలుకుని వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, ముస్తఫా, సునీల్, చంద్రమోహన్, మోహన్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

మహాసభతో చేనేతల సత్తా చాటుదాం



మాట్లాడుతున్న జాతీయ చేనేత అధ్యక్షుడు బండారు ఆనంద్‌ప్రసాద్

ధర్మవరం: మహాసభతో చేనేతల సత్తా చాటుదామని జాతీయ చేనేత అధ్యక్షుడు బండారు ఆనంద్‌ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రణవ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర చేనేత అధ్యక్షులు శివరాంప్రసాద్, ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కుల సంఘాలను ఐక్యం చేయడానికి మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఏ పార్టీ అయితే మా చేనేత పరిశ్రమను గుర్తిస్తుందో ఆ పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. రాజకీయాలకు అతీతంగా తమ సేవలను కొనసాగిస్తామని తెలిపారు. చేనేత బలాన్ని రాష్ట్రీయ, జాతీయ స్థాయిలలో నిరూపించుకునేలా పలు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఐకమత్యంతో చేనేత పరిశ్రమను కాపాడుకుంటామని అవసరమైతే దశలవారీగా పోరాటాలు సలుపుతామని తెలిపారు. జనవరి 29న ధర్మవరంలో చేనేత మహాసభ నిర్వహిస్తామని ప్రకటించారు. చేనేత జాతీయ అధ్యక్షురాలు జయశ్రీ, పట్టుచీరల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి, గౌరవాధ్యక్షుడు పోలా వెంకటనారాయణ, గిర్రాజు నగేష్, నాయకులు నాగరాజు, గడ్డం శ్రీనివాసులు, బండారు ఆదినారాయణ, పల్లెం వేణుగోపాల్, చంద్రమౌళి, చింతా శ్రీనివాసులు, నాగరాజు, గడ్డం పార్థసారధి, సుధాకర్, డాక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు



గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

ధర్మవరం: క్రీడలతోనే ఉజ్వల భవిత ఉంటుందని, ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో రాణించాలని యశోద కాన్సెప్ట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. పట్టణంలోని యశోద పాఠశాలలో ఆదివారం ఫస్ట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో 23 టీములు పాల్గొనగా బాలుర విభాగంలో తిరుపతి జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టు మొదటిస్థానంలో నిలిచింది. బాలుర విభాగం ద్వితీయస్థానంలో కడప, తృతీయ స్థానంలో అన్నమయ్య జట్టు, బాలికల విభాగం సత్యసాయి జట్టు రెండో స్థానం, నెల్లూరు జట్టు మూడోస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో అంబికా ముక్కోటి సేవా కమిటీ చైర్మన్ శివ, హ్యాండ్‌బాల్ కార్యదర్శి శివ, త్రోబాల్ కార్యదర్శి రవి, టార్గెట్‌బాల్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి సుధారాణి తదితరులు విజేతలకు కప్‌లు, మెమెంటోలు అందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పూజ చేసి బోరుబావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సునీతాబాయి

నల్లమాడ: మండల కేంద్రంలోని హమాలీ కాలనీ, ఆర్‌డీటీ ఏరియా కార్యాలయ ప్రాంగణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో నూతనంగా రెండు బోర్లు వేయించినట్లు ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి తెలిపారు. రెండుచోట్లా సమృద్ధిగా నీళ్ల పడటంతో త్వరలోనే పైప్‌లైన్, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. అడిగిన వెంటనే స్పందించి బోరుబావి తవ్వించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు



బాధితుడు పోతలయ్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రెండో గేటు వద్ద ఆటో ఢీకొని హోంగార్డుకు తీవ్రగాయాలయ్యాయి. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న పోతలయ్య ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రెండో గేటు వద్ద ఆటో దిగి నిలుచున్నాడు. ఇంతలో ఓ ఆటో వేగంగా వచ్చి అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని ఎడమకాలికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండె వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని కొత్తపేట ఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 100 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, సభ్యులు చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, శీలా నాగేంద్ర, జయరాం, రమేష్‌బాబు, నామాల శ్రీనివాసులు, బండి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశిష్టం.. ధనుర్మాసం

- నెలంతా బాలభోగం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ముంగిళ్లలో ముగ్గుల సందడి



ఇంటి ముంగిట రంగువల్లులు



బత్తలపల్లిలో విశేష పూజలందుకుంటున్న లక్ష్మీవెంకటేశ్వరుడు

బత్తలపల్లి: కార్తీకం, మాఘం, శ్రావణం.. ఇలా ఈ నెలలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యత ఉందని చాలా మంది భావిస్తారు. కానీ ధనుర్మాసం కూడా అత్యధిక ఆధ్యాత్మిక ప్రయోజనాలు కలిగిన మాసంగా పలువురు గుర్తించి విశేష పూజలు చేస్తున్నారు. ధనుర్మాసం అంతా ఉదయం, సాయంత్రం ఇళ్లు శుభ్రం చేసి దీపారాధన చేయటం వల్ల మహాలక్ష్మీ కరుణాకటాక్షాలు సిద్ధిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. ధనుర్మాసం విష్ణువునికి చాలా ప్రత్యేకమైనది. తిరుమలలోనే గాక, అనేక ప్రసిద్ధి ఆలయాల్లో ధనుర్మాసం నెల రోజులు తిరుప్పావై గానానికి ఒక ప్రత్యేక సందర్భం. విష్ణు ఆలయాల్లో ఉదయాన్నే అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. ఇలా చేయటాన్నే బాలభోగం అంటారు. అలాగే ధనుర్మాసం దేవతలకి బ్రాహ్మీ ముహూర్తం వంటిదని భావించటం పరిపాటి. ఈ మకర కర్కాటక సంక్రాంతుల్లో స్నాన, దాన, హోమ, వ్రత పూజలు చేయటం చాలా మంచిది. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసమని అర్థం. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. దేవాలయాల్లో అండాలమ్మ పూజ, తిరుప్పావై పఠనం, గోదా కళ్యాణం, ప్రసాదాలు తదితరాలు ధనుర్మాసంలోనే నిర్వహిస్తారు. ఈ మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయటం వలన లక్ష్మీదేవి అనుగ్రహంతో పాటు దారిద్ర్యం కూడా దూరమవుతుందని నమ్మకం.

విష్ణువుకు పొంగలి నైవేద్యం..

ధనుర్మాసంలో విష్ణువుని మధుసూదనుడు అనే పేరుతో పూజించి, మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగంతో స్వామివారికి నైవేద్యం సమర్పించాలి. పెళ్లికాని అమ్మాయిలతో పాటు ముత్తయిదువులు కూడా ఇంటిముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేయటం వల్ల తాము కోరిన కోర్కెలు నెరవేరుతాయని విశ్వాసం. గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసం అంతా పూజించింది. అందుకనే శ్రీకృష్ణుని ధనుర్మాసం నెల రోజులూ తులసీమాల సమర్పించే యువతులకు నచ్చిన వరునితో వివాహం జరుగుతుందని భావిస్తారు. ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనాలు ఉన్నాయి. ధనుర్మాసంలో విష్ణుప్రతిమలను విశేషంగా పూజిస్తారు. రోజూ ఉదయాన్నే సూర్యోదయానికి ముందే స్నానాలు పూర్తి చేసి, పంచామృతాలతో మహావిష్ణువుకి అభిషేకాలు నిర్వహిస్తారు. తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర నామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పిస్తారు. ఇలా నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతం చేయటం వల్ల ఇహలోక సుఖాలు, పరలోక మోక్షం పొందుతారని, ఆత్మ పరమాత్మను చేరటానికి ఉపకరించేదే ధనుర్మాసం అని భారతీయులు నమ్ముతారు.

ధనుర్మాస విశేష పూజలు ప్రారంభం..

ధనుర్మాసం సందర్భంగా బత్తలపల్లి మండలంలోని బత్తలపల్లి లక్ష్మీవెంకటేశ్వరాలయం, దంపెట్లలోని మదనాపురి చెన్నకేశవాలయం ఆలయాల్లో విశేష పూజలు ప్రారంభించారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడమేగాక, ధనుర్మాసం ఈ నెల రోజుల పాటు స్వామికి విశేష పూజలు నిర్వహించనున్నామని ఆయల ప్రధాన అర్చకులు ద్రాక్షాయణి, శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోజూ ఉదయం 4 గంటల నుంచి మంగళ వాయిద్యాలతో తిరుప్పావై పఠనం ఉంటుందని, బిందె తీర్థం, సాలగ్రామ పంచామృతాభిషేకం చెన్నకేశవస్వామి వారికి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రోజూ గోదాదేవికి సహస్రనామార్చనలు జరుగుతాయన్నారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భక్తులు విశేష పూజల్లో పాల్గొని తరించాలని కోరారు.

క్లుప్తంగా

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే ఉదయం 7 గంటలకు శ్రీకాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం ఆయన చిల్లవారిపల్లి, రామాపురం, కునుకుంట్ల గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తారన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పొరాళ్ల సావిత్రి, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న పెద్దమ్మ తల్లి.

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పాలు, పుష్ప మాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయ ప్రదక్షిణలు చేసిన అనంతరం పెద్దమ్మ తల్లికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

నల్లచెరువు: మండల కేంద్రంలోని వాసవీ మాత ఆలయంలో ఆదివారం తిరుప్పావై పారాయణం నిర్వహించారు. వాసవి మహిళా మండలి సభ్యులు ఈ సందర్భంగా వాసవీ మాతను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ధనుర్మాసంలో రోజూ ఉదయం 5:30 గంటలకు పారాయణం ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు మానస,కుమారి,మంజుల,రాధ, సావిత్రి, వజయలక్ష్మీ, శకుంతల, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు పెన్షనర్ల భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగించారు. అనంతరం 80 ఏళ్ల పైబడిన పలువురి పెన్షనర్లను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. పింఛన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జనరల్ సెక్రటరీ నాగార్జునశెట్టి, కోశాధికారి రామప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ పార్థసారథి, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఫణికుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. 75 సంవత్సరాలు నిండిన 30 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి, నరసింహారెడ్డి, నాగభూషణగౌడ్, సుబ్బారాయుడు, నందప్ప, సుభాషిణి, రత్నమయ్య, షెక్షావలి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆరోగ్యశ్రీ కార్డులు, బ్రోచర్ల పంపిణీ

బత్తలపల్లి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు, బ్రోచర్లను సోమవారం పంపిణీ చేయనున్నట్లు బత్తలపల్లి పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బత్తలపల్లి-1 గ్రామ సచివాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే చర్యలు

ఓడీచెరువు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఎవరినీ ఉపేక్షించవద్దని డీఎస్పీ వాసుదేవన్ పేర్కొన్నారు. ఓడీచెరువు మండలంలోని పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వాసుదేవన్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలపై ముందుగా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్.ఐ మల్లికార్జునరెడ్డికి సూచించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి తాగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ రాజేంద్రనాథ్, ఏఎస్ఐ కిశోర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

భగవద్గీత కంఠస్థ పోటీలు



కార్యక్రమానికి హాజరైన బాలికలు

కదిరి టౌన్: పట్టణంలోని వాణీవిధిలో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు.180 మంది వివిధ పాఠశాల విద్యార్థులు హాజరై పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు రిటైర్డ్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డీసీ బాబాయ్య, తెలుగు లెక్చరర్ రమణ న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఘనంగా కనకదాస జయంతి

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆదివారం కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక కురుబల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, నాయకులు బిల్లే ఈశ్వరయ్య హాజరయ్యారు. స్థానిక పెదయ్యస్వామి దేవాలయంలో కనకదాస చిత్ర పటానికి పూజలు చేశారు. గ్రామంలోని వందలాది మంది కురుబలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. కురుబలు ఐకమత్యంతో అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, చెన్నప్ప, స్థానిక కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో చేనేత కార్మికుడు చింతా రమణదాస్ కుమారుడు ధర్మతేజ విద్యుత్‌షాక్‌కు గురై బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శరీరం అంతా కాలడంతో సర్జరీ చేయడానికి దాదాపు రూ.10లక్షల వరకు ఖర్చుఅవుతుందని వైద్యులు తెలిపారని చేనేత కార్మికుడు రమణదాస్ ఆవేదన వ్యక్తంచేశాడు. విషయం తెలుసుకున్న దాతలు భద్రాచలం, రమేష్, రాజేష్, లక్ష్మీనారాయణ వారి మిత్ర బృందం రూ.15 వేలు నగదును ఆదివారం రమణదాస్ కుటుంబ సభ్యులకు అందించారు. ఎవరైనా ఆర్థికసాయం చేయాలనుకునేవారు 9966728505 నంబరుకు ఫోన్‌పే వేయాలని బాధితులు విన్నవిస్తున్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష



భోజనం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్ట తండాలో ఆదివారం అయ్యప్ప మాలధారులకు కో–ఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్ భిక్ష ఏర్పాటు చేశారు. సుమారు 200 మందికి అన్నదానం చేశారు. అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు అందిరిపై ఉండాలని ఆకాక్షించారు.

నేడు 'స్పందన'

తాడిమర్రి: తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) MAHINDRA ALFA DX DIESEL BSVI 2022 MODEL AP39 UA 2640
2) MAHINDRA ALFA LC PLUS DIESEL BSVI 2022 MODEL AP39 UE 7434
Cell : 99896 20305
D.No. 14/7E, Near Republic ITI College, Ananthapur Road, KADIRI.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486